# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం, 19, మే, 2023






**ప్లస్ స్కూళ్లపై ప్రత్యేక దృష్టి**
హైస్కూల్ ప్లస్ చదువులపై జిల్లా విద్యా శాఖఅధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. -IIలో..



**అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు**
అనుమతులు లేకుండా లే అవుట్లు నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని అనుడా వైస్ చైర్మన్ ఓబులేసు నందన్ సూచించారు. -IIలో..



**విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి**
విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏపీఎస్ పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ ఆదేశించారు. -IIలో..

# ఆరోగ్యానికి పట్టణం



ఇతని పేరు సుబ్రమణ్యం. కడప నగరం మోచంపేట వాసి. ఇటీవల ఒక వాహనం అతడిని రాసుకుంటూ వెళ్లడంతో పాదం పై భాగంలో కోసుకుని రక్తస్రావం జరిగింది. సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు. ప్రాథమిక చికిత్స చేసినందుకు రూ 2 వేలకు పైగా అవుతుందని చెప్పారు. అంత డబ్బు ఖర్చు చేయలేక తమ ఏరియాలో ఉన్న 'డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం'కు వెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించారు. స్టాఫ్ నర్స్ రబ్బానీ చికిత్స అందించింది. పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా లభిస్తున్న వైద్య సేవల పట్ల సుబ్రమణ్యం సంతోషం వ్యక్తం, చేశారు.

- ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో ప్రాథమిక వైద్యం
- 'డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం'తో ప్రజలకు నజరానా

**కడప రూరల్:** సిరి సంపదల కంటే ఆరోగ్యమే ప్రధానం. అనారోగ్యం పాలైతే ఎంత సంపద ఉన్నా ప్రయోజనం శూన్యం.ఇది గమనించిన ప్రభుత్వం ఆరోగ్య రంగానికి పెద్ద పీట వేసింది. 'డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం'ద్వారా చెంతనే వైద్య సేవలు లభించేలా చర్యలు చేపట్టింది.ఫలితంగా పేదలు, మధ్య తరగతి ప్రజానీకం నిశ్చింతంగా ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగిస్తున్నారు.

**టీడీపీ పాలనలో ఆరోగ్య కేంద్రాలకు అనారోగ్యం..**

తెలుగుదేశం పార్టీ పాలనలో పట్టణ ఆరోగ్య కేంద్రాలు జిల్లాలో 15 మాత్రమే ఉండేవి. అవి కూడా సక్రమంగా పని చేసేవి కాదు. మందులు నామమాత్రంగా ఉండేవి. వైద్య పరీక్షలు కూడా సక్రమంగా జరిగేవి కావు. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఉండే ప్రజలకు ఆరోగ్య కేంద్రాలపై నమ్మకం సన్నగిల్లింది. దీంతో వారంతా ప్రైవేట్ ఆసుపత్రుల బాట పట్టేవారు. అనారోగ్యంతో ఒళ్లు గుల్ల కావడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొనే వారు.



కడపలోని మోచంపేటలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

**నేడు ఒకేసారి 30 కేంద్రాల్లో వైద్య సేవలు...**

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక వైద్య రంగం రూపు రేఖలను సమూలంగా ప్రక్షాళన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ను బలోపేతం చేశారు. చారిత్రాత్మకంగా 'ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్'ను ప్రవేశపెట్టారు.టీడీపీ పాలనలో కేవలం 15 పట్టణ ఆరోగ్య కేంద్రా లు ఉంటే వాటి సంఖ్యను ఏకంగా 30కు పెంచారు. 'డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం'గా మార్పు చేసి, నగర వాసులకు అత్యుత్తమ వైద్య సేలు లభించేలా చర్యలు చేపట్టారు. అలాగే కార్పొరేట్ స్థాయిలో కొత్త భవనాలను నిర్మించారు. ఒక కొత్త ఆసుపత్రి నిర్మాణానికి లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. కండీషన్‌లో ఉన్న ప్రభుత్వ పాత భవనాలకు కూడా మరమ్మతుల కోసం రూ 20 లక్షలకు పైగా ఖ ర్చు పెట్టారు. కొత్త భవనాల పూర్తి కావడం ఆలస్యం అవుతాయి. వైద్య సేవలకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో భవనాలు అందుబాటులో లేని చోట తాత్కాలింగా అద్దె భవనాల్లో వైద్య సేవలను ప్రారంభించారు. ఇలా ఏకకాలంలో 30 ఆసుపత్రుల ద్వారా జిల్లాలోని పట్టణ వాసులకు వైద్య సేవలు అందుతున్నాయి.

**ప్రాథమిక వైద్య సేవలు ఇలా...**

ఈ ఆసుపత్రుల్లో బీపీ, షుగర్, అన్ని రకాల జ్వరాలు, వాంతులు, విరేచనాలు, గాయాలకు ఇతర వ్యాధులకు ప్రాథమిక వైద్య సేవలు లభిస్తాయి. అలాగే ఆసుపత్రి పని వేళల్లో మాత్రమే ఇన్ పేషెంట్స్‌గా అడ్మిట్ కావడానికి పడకల సదుపాయం ఉంది. ఈ ఆసుపత్రిలో ఒకరి చొప్పున వైద్యుడు, ఫార్మాసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్, లాస్ట్ గ్రేడ్ సర్వీస్, ఇద్దరు స్టాఫ్ నర్స్‌తో పాటు ఈ ఆసుపత్రి పరిధిలో సచివాలయాల్లో గల ఏఎన్ఎం, ఆశాలు పనిచేస్తుంటారు.

**నిరంతరం పర్యవేక్షణ...**

పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా స్థానికులకు మెరుగైన వైద్య సేవలు లభిస్తున్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఆసుపత్రుల్లో లభించే వైద్య సేవలపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది.
– డాక్టర్ ఖాదర్‌వలి, ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

**జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లభించే వైద్య సేవలు..**

- వైద్య పరీక్షల రకాలు : 64
- లభించే మందులు : 172
- సగటున ఒక కేంద్రానికి వచ్చే రోగులు : 41
- ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు వచ్చిన 'ఓపీ'కేసులు : 3,69,225 మంది
- ఆరోగ్య కేంద్రం స్థాయి : 10 పడకలు
- ఆరోగ్య కేంద్రం పని వేళలు : ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు

**ఆసుపత్రుల భవనాల వివరాలు**

- మొత్తం భవనాలు : 30
- కొత్తగా మంజూరైనవి : 21
- కొత్త భవనాల్లో కొనసాగుతున్నవి: 12
- పూర్తి కాని భవనాలు : 09
- అద్దె భవనాల్లో కొనసాగుతున్నవి: 09



**జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల వివరాలు**

| పట్టణం | కేంద్రాలు |
| --- | --- |
| కడప | 13 |
| ప్రొద్దుటూరు | 06 |
| పులివెందుల | 02 |
| జమ్మలమడుగు | 02 |
| బద్వేల్ | 03 |
| మైదుకూరు | 02 |
| యర్రగుంట్ల | 01 |
| కమలాపురం | 01 |

## ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

- కలెక్టర్ విజయరామరాజు



**కడప కోటిరెడ్డి సర్కిల్ :** ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రతిఒక్కరూ తప్పక పాటించాలని, 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటుహక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి పెండింగ్‌లో ఉన్న ఫాం-6, 7, 8 క్లెయింలు, కొత్త రివైజ్డ్ వెర్షన్ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫాం 6, 7,8 క్లెయింలు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. కొత్తగా రివైజ్డ్ వర్షన్ ఈఆర్‌ఓ, నెట్ వర్షన్ 2.0కు సంబంధించి ఎలాంటి అనుమానాలు, సమస్యలు ఉన్నా తెలియజేయాలన్నారు. రానున్న సాధారణ ఎన్నికలు ఎలా నిర్వహించాలి అన్నదానిపై ఎస్‌ఓపీలను సిద్ధం చేయాలని పలువురు కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు ఎక్కడ భద్రపరుస్తున్నారనే విషయాలపై కూడా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని కొత్త నిబంధనల మేరకు సంవత్సరంలో నాలుగు దఫాలుగా ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేయనుందని తెలిపారు. అందుకు అనుగుణంగా 18 సంవత్సరాలు నిండిన యువతకు ఖచ్చితంగా ఓటుహక్కు కల్పించేందుకు అవగాహన పెంచాలన్నారు. ఈవీఎంలు భద్రపరుచుటకు గోడౌన్‌లు పూర్తిస్థాయిలో భద్రతాప్రమాణాల మేరకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. క్లెయిం పెండింగ్ ఫాం 6,7,8 ఎన్నికల నిబంధనల ప్రకారం పాటించి సమగ్ర విచారణ జరిపి విచారణ జరిపి పరిష్కరించాలని సూచించారు.

## న్యూస్‌రీల్

### వైఎస్సార్ ఆసరా మూడోవిడత ప్రారంభం

**కడప రూరల్:** వైఎస్సార్ ఆసరా మూడోవిడత ప్రారంభం అవుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనందనాయక్ తెలిపారు. 21,056 గ్రామీణ మహిళా సంఘాలకు గాను ఇప్పటిదాకా 12,356 సంఘాల ఖాతాలకు నిధులు జమ అయ్యాయన్నారు. మిగిలిన 8,700 సంఘాలకు ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం జమ అవుతాయన్నారు. మూడోవిడత ఆర్థికసాయం కింద అర్హత గల అన్ని సంఘాల ఖాతాలకు నిధులు జమ అవుతాయన్నారు. సభ్యులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

### 22న జెడ్పీ, డీఆర్సీ సమావేశాలు

**కడప సెవెన్‌రోడ్స్:** జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం, జిల్లా సమీక్షా కమిటీ సమావేశం ఈ నెల 22వ తేదీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి వెంకటరావ్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశం ఉదయం 9 గంటలకు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమదనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి హాజరవుతారన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే డీఆర్సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సురేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు.


### నేడు ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు

**వైవీయూ:** కడపలోని హరిత టూరిజం హోటల్‌లో ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు గ్రేటర్ రాయలసీమ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల ఆత్మీయ సమావేశం జరగనుంది. ఈ విషయాన్ని కడప జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. మదన్ మోహన్‌రెడ్డి, జి. వెంకటశ్రీను తెలిపారు. గురువారం కడపలో వారు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి పరిష్కారం గురించి చర్చించనున్నట్లు తెలిపారు. కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పాల్గొని ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల కరస్పాండెంట్‌లు సంజీవ్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుదుత్పత్తిలో ఆర్టీపీపీ రికార్డు



**ఎర్రగుంట్ల :** వేసవి కాలంలో విద్యుత్ ఉత్పత్తికి డిమాండ్ ఉంటుంది. అయితే డిమాండ్‌ను అధిగమిస్తూ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ) ఏపీజెన్‌కో యజమాన్యం ఆదేశాల మేరకు ఉత్పత్తి చేస్తూ వెలుగులు నింపుతోంది. ఆర్టీపీపీలో ఉన్న 1,2, 3,4,5,6 యూనిట్ల ద్వారా 1650 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతుంది. గురువారం 1650 మెగావాట్లకు గాను 1542 మెగావాట్ల ఉత్పత్తి జరిగింది. ఆర్టీపీపీలో పనిచేస్తున్న ఇంజినీర్లు, ఉద్యోగులు కార్మికుల సమన్వయంతో పీక్ సమయంలో యూనిట్లు బాగా రన్ చేయడం సాధ్యపడిందని ఇన్‌చార్జి సీఈ దేవేంద్రనాయక్ తెలిపారు. గతంలో ఆర్టీపీపీకి చాలా బొగ్గు కొరత ఉన్న సమయంలో యూనిట్లను నిలుపుదల చేసిన పరిస్థితులు కూడా ఉన్నాయి.

### గాలివానకు పండ్లతోటలు ధ్వంసం



నాగవరంలో పడిపోయిన అరటితోట

**చిట్వేలి:** మండలంలోని నాగవరం, సీఎం రాచపల్లి పంచాయతీలలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పంట చేతి కొచ్చే సమయంలో అకాల వర్షంతో అరటితోటలు ధ్వంసమయ్యాయి. మామిడి కాయలు రాలిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండల ఉద్యానశాఖ అధికారిణి ఆసి యా, సచివాలయం వీహెచ్‌ఏ రామాంజనేయులు పంటనష్టాన్ని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

## అధిక ఉష్ణోగ్రతల వల్లే విద్యుత్ అంతరాయం

- జిల్లాలో విద్యుత్ కోతలు లేవు
- ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ పర్యవేక్షక ఇంజినీరు రమణ



**కడప కార్పొరేషన్:** జిల్లాలో ఇదివరకెన్నడూ లేనివిధంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం వల్లే విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం కలుగుతోందని ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెట్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ అన్నారు. గురువారం ఇక్కడ ఆయన మాట్లాడారు. అన్నమయ్య జిల్లా, సంబేపల్లి మండలంలోని మోటకట్ల ఆయన స్వగ్రామం. తిరుపతి కన్‌స్ట్రక్షన్ డివిజన్‌లో, పీలేరులో, చిత్తూరు రూరల్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేశారు. పదోన్నతిపై కడప ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈగా వచ్చారు. కడపలో పట్టణంలో ఏడీఈగా పనిచేసిన అనుభవం ఉంది. ఇంకా ఆయన ఏమన్నారంటే...

జిల్లాలో మొత్తం 1179 ఫీడర్లు ఉండగా, అందులో 793 అగ్రికల్చర్ ఫీడర్లు ఉన్నాయన్నారు. సాధారణంగా ప్రతిరోజూ జిల్లాలో 600 నుంచి 700 మెగావాట్ల మధ్యలో విద్యుత్ వినియోగం జరుగుతుందన్నారు. రెండు, మూడు రోజులుగా విద్యుత్ డిమాండ్ బాగా పెరిగిందన్నారు. 44 డిగ్రీలకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడమే ఇందుకు కారణమని తెలిపారు. మొన్న(మంగళవారం) ఉదయం 557 మెగావాట్లు, మధ్యాహ్నం 12 గంటలకు అత్యధికంగా 959 మెగావాట్లు, సాయంత్రం 439 మెగావాట్ల విద్యుత్ వాడకం జరిగిందన్నారు. ఇంత ఉష్ణోగ్రతల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్ అయి సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. రాత్రిపూట కొద్దిసేపు వాటిని కూల్ చేసి నిర్వహణ చేసే క్రమంలోనే విద్యుత్ అంతరాయం కలుగుతోందన్నారు. అంతే తప్ప అవి విద్యుత్ కోతలు కావన్నారు. నాలుగైదు రోజుల్లో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంతో పోల్చితే డిమాండ్‌కు తగినట్లు విద్యుత్ ఉత్పత్తి ఉందని, ధర ఎంతైనా ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధగా ఉందన్నారు. బొగ్గు నిల్వలు కూడా నెల రోజులకు సరిపడా అందుబాటులో ఉన్నాయన్నారు. అగ్రికల్చర్ సర్వీసులకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న నెలలోపే కనెక్షన్లు ఇస్తున్నామని, ఇప్పటికి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 1000 కనెక్షన్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 500 సర్వీసులకు సంబంధించి పనులు జరుగుతున్నాయన్నారు. ఎక్కడా మెటీరియల్ కొరత లేదన్నారు. సబ్ ఇంజినీర్ నుంచి ఏఈకి పదోన్నతి కల్పించే అంశం కోర్టు పరిధిలో ఉన్నందున పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కొత్త రిక్రూట్‌మెంట్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. త్వరలోనే ఖాళీగా ఉన్న ఏఈ పోస్టులు, జేఎల్ఎం, ఇతర పోస్టులు భర్తీ అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## జిల్లాలో ఉపాధి అవకాశాలకు కొదువ లేదు

**కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి**



మెగా ఇండస్ట్రియల్ పార్కును పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి , కలెక్టర్ విజయరామరాజు తదితరులు

**కడప కార్పొరేషన్/సెవెన్‌రోడ్స్:** కొప్పర్తి పారిశ్రామిక వాడలో నూతన పరిశ్రమల ఆవిర్భావంతో పాటు ఉత్పత్తులు కూడా ప్రారంభమయ్యాయని, జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొదువ లేదని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కొప్పర్తిలో 540 ఎకరాల్లో ఏర్పాటైన వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను కలెక్టర్ విజయ్‌రామరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఎంసీలో రెండు లక్షల చదరపు అడుగుల్లో ఏపీఐఐసీ వారు నిర్మించిన షెడ్లలో డిక్సన్ కంపెనీ సంస్థ ఇటీవలే ప్రారంభించిన సీసీ కెమెరాల ఉత్పత్తులను ఎంపీ, కలెక్టర్ పరిశీలించారు. సీసీ కెమెరాల నాణ్యతతోపాటు అక్కడ సిబ్బంది, సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇస్తూ ఎలాంటి సమస్యలు ఉన్నా తమకు తెలియజేయాలన్నారు. అనంతరం వారు పారిశ్రామికవాడలో కలియతిరిగి అక్కడ జరుగుతున్న ఇతర అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఆ దిశగా కొప్పర్తి పారిశ్రామిక వాడను రాష్ట్రంలోనే మోడల్ ఇండస్ట్రియల్ పార్కుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అందులో భాగంగానే కొప్పర్తి పారిశ్రామిక వాడలో జిల్లాలో తలమానికంగా ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్(ఈఎంసీ)ని తీర్చిదిద్దుతున్నారన్నారు. వివిధ రకాల పరిశ్రమల పనులు కూడా పురోగతిలో ఉన్నాయన్నారు. ఎన్నో ప్రతిష్టాత్మక కంపెనీలు కొప్పర్తి పారిశ్రామిక వాడకు తరలి వస్తున్నాయని తెలిపారు. ఎలక్ట్రానిక్ హబ్‌లో డిక్సన్ నిర్మించిన కంపెనీలో సీసీ కెమెరాల ఉత్పత్తి కూడా ప్రారంభం కావడం శుభపరిణామమన్నారు. త్వరలో ఏర్పాటు కానున్న కడప స్టీల్ ప్లాంటు నిర్మాణం ద్వారా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి పురోగతి సాధించడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల త్వరలోనే సాకారం కానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, సీకే దిన్నె తహసీల్దార్ గంగయ్య పాల్గొన్నారు.

## సేవకు సత్కారం

- ప్రజలకు విశేష సేవలు అందించిన వారికి ప్రత్యేకంగా ప్రత్యేక గుర్తింపు
- సేవా పతకాలతో సత్కరిస్తున్న ప్రభుత్వం
- సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రల కేటగిరీల కింద పురస్కారాలు




వలంటీర్లకు అందజేసే సేవా వజ్ర, రత్న, మిత్ర సర్టిఫికెట్లు

**ఎర్రగుంట్ల:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా అందించడంలో విశేష సేవలందిస్తున్న వలంటీర్లను ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది. పేదలకు సంబంధించి ఎలాంటి తారతమ్యాలు చూపకుండా సకాలంలో సంక్షేమాన్ని అందిస్తున్న వలంటీర్లను సత్కారాలతో గౌరవించి ప్రోత్సహించాలని సంకల్పించింది. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అయితే వారికి నెలనెలా రూ.5వేల చొప్పున గౌరవ వేతనం కింద ఇస్తున్న ప్రభుత్వం విశేష సేవలందిస్తున్న వారికి ప్రభుత్వం తరపున ప్రోత్సహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా గత ఏడాది విశిష్ట సేవలందించిన వారికి వివిధ రకాల ప్రోత్సాహకాల కింద నగదుతోపాటు శాలువా, జ్ఞాపిక, సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు.

వైఎస్సార్ జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 10,231 మంది అవార్డులకు ఎంపికయ్యారు. సేవా వజ్ర కింద 39 మంది, సేవారత్న 228, సేవామిత్ర 9964 మంది ఎంపికయ్యారు. సేవా మిత్ర కింద ఎంపిక చేసిన వలంటీర్లకు రూ.10వేల చొప్పున, సేవా రత్న కింద ఎంపిక చేసిన వారికి రూ.20వేలు, సేవా వజ్ర కేటగిరి కింద ఎంపిక చేసిన వారికి ఒక్కొక్కరికి రూ.30వేల చొప్పున అందించనున్నారు. వలంటీర్లకు సంబంధించి ప్రతినెలా 1వ తేదీ తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ, ఇతర ప్రాంతాల్లో లబ్ధిదారులు ఉన్నప్పటికి అక్కడికే వెళ్లి సంక్షేమం అందించడం, సకాలంలో సేవలు అందించే విధానంలో సర్వేలు సత్వరమే పూర్తి చేయడం, ఆన్‌లైన్ లిస్టుల వెరిఫికేషన్, లబ్ధిదారుల జాబితా, ఇతర సేవలు, సంక్షేమ ఫలాల జాబితా తయారీలో వేగంగా స్పందించడం, ఇతర అన్ని వ్యవహారాల్లో చురుగ్గా వ్యవహరించేవారిని ప్రభుత్వం ఈ అవార్డులకు అర్హతలను బట్టి ఎంపిక చేసింది.

**నేటి నుంచి సత్కారాలు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా సత్కారాలు ప్రారంభించగానే.. జిల్లాలో చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండవ ఏడాది వలంటీర్లను సత్కరించేందుకు సిద్ధమైంది. ఈనెల 19వ తేదీనుంచి ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో వలంటీర్ల సేవల ఆధారంగా మూడు కేటగిరీల వారీగా పేర్లను సిద్ధం చేశారు. నేటి నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని రోజుకు రెండు గ్రామ వార్డు సచివాయాల్లో నిర్వహించాలని , ఇందుకు అవసరమైన కార్యచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అలాగే జిల్లాలోని అన్ని సచివాలయాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించి వారిని ఆహ్వానించి నెలలోగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## జిల్లాలోని విశ్వవిద్యాలయాలకు ఏఐసీటీఈ గ్రీన్‌సిగ్నల్

**వైవీయూ, ఏఎఫ్‌యూలో కోర్సులకు అనుమతులు**



యోగివేమన విశ్వవిద్యాలయం ముఖద్వారం


**వైవీయూ/ఏఎఫ్‌యూ :** ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) జిల్లాలోని రెండు విశ్వవిద్యాలయాలకు 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. యోగివేమన విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు సంబంధించి ఒక్కో కోర్సులో 60 సీట్లు చొప్పున అనుమతులకు ఓకే చెప్పింది. ఇటీవల వర్చువల్ విధానంలో ఏఐసీటీఈ అధికారులు విశ్వవిద్యాలయ అధికారులతో సమావేశం నిర్వహించడంతో పాటు డిటైల్డ్ రిపోర్ట్‌ను అధ్యయనం చేసి సిఫార్సు చేయడంతో ఏఐసీటీఈ అనుమతులు జారీచేసింది. ఏఐసీటీఈ అనుమతులు లభించడం పట్ల విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య సంతోషం వ్యక్తం చేశారు.

- నూతనంగా ఏర్పాటైన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని 12 కోర్సులకు సంబంధించి 6 కోర్సులకు 40 సీట్లు, మరో 6 కోర్సులకు 60 సీట్లకు అనుమతులు జారీచేస్తూ ఏఐసీటీఈ ఉత్తర్వులు జారీచేసింది. విశ్వవిద్యాలయానికి ఏఐసీటీఈ అనుమతులు మంజూరు చేయడం పట్ల విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## ఐదుగురు తహసీల్దార్ల బదిలీ

**బి.కొత్తకోట (అన్నమయ్య జిల్లా):** తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన ఇద్దరితోపాటు ఐదుగురు తహసీల్దార్లను పాలనాపరమైన మార్పుల్లో భాగంగా డిప్యూటేషన్లపై బదిలీ చేస్తూ గురువారం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఉత్త ర్వులు జారీ చేశారు. బి.కొత్తకోట తహసీల్దార్ కే.ధనుంజయులును పీలేరుకు, పెద్దమండ్యం తహసీల్దార్ కే.నిర్మలాదేవిని కలెక్టరేట్‌లోని మెజిస్టీరియల్ విభాగానికి సూపరింటెండెంట్‌గా, తహసీల్దార్ ఎస్.రఫీక్ అహ్మద్‌ను బి.కొత్తకోట తహసీల్దార్‌గా, డెప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లో పనిచేస్తున్న గుర్రంకొండ తహసీల్దార్ డీసీ.కృష్ణమోహన్‌ను పెద్దమండ్యం తహసీల్దార్‌గా, తహసీల్దార్ సీకే.శ్రీనివాసులును కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంబాభవానీనగర్‌కు వెళ్లే దారిలో వున్న మంగళి వీధిలో గుర్తు తెలియని వ్యక్తి అతిగా మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. ఉదయం 11 గంటల సమయంలో సదరు గుర్తు తెలియని వ్యక్తి మద్యం మత్తులో ఆ ప్రాంతంలో పడిపోయాడు. సాయంత్రం సమయానికి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో కడప వన్‌టౌన్ ఎస్‌ఐ సిద్దయ్య తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. అతని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తమను సంప్రదించాలని కడప వన్‌టౌన్ సీఐ ఎస్.వి నాగరాజు సెల్ నంబర్ 91211 00510, ఎస్‌ఐ సిద్దయ్యకు సమాచారం అందించాలని, లేక నేరుగా సంప్రదించాలి.

## వడదెబ్బకు వృద్ధురాలు..



మృతి చెందిన లక్షుమ్మ

సిద్దవటం : మండల పరిధి పెద్దపల్లె గ్రామ పంచాయతీలోని శివునిపల్లె గ్రామానికి చెందిన సోమల లక్షుమ్మ(72) అనే వృద్ధురాలు గురువారం వడదెబ్బకు గురై మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. రెండు రోజులుగా ఎండ వేడిమితో ఆమె బాధపడుతుండేది. గురువారం ఉదయం ఉన్నట్లుండి కింద పడిపోవడంతో కుటుంబ సభ్యులు 108 వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు వారు తెలిపారు. సమాచారం తెలుసుకున్న మాధవరం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శివకుమార్ వచ్చి పరిశీలించారు. పెద్దపల్లె సర్పంచ్ కుమారుడు తుర్రా ప్రతాప్, నాగం నరసింహారెడ్డి వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు.

## పిడుగుపాటుకు గేదె..

ఓబులవారిపల్లె : మండలంలోని మంగంపేట కాపుపల్లి గ్రామంలో గురువారం పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. గ్రామంలోని చిన్నవెంకట సుబ్బారెడ్డికి చెందిన గేదె గ్రామ సమీపంలో మేత మేయడానికి వెళ్లింది. మబ్బులతో ఉరుములు మెరుపులు మెరిసి ఒక్కసారిగా పిడుగుపడటంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. పాలిచ్చే గేదె మృతి చెందిందని పాడి రైతు వాపోయాడు.

# ప్లస్ స్కూళ్లపై ప్రత్యేక దృష్టి

- సబ్జెక్టు టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు
- స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



హైస్కూల్ ప్లస్‌గా మార్చిన బద్వేల్ జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతుల ఆధారంగా హైస్కూల్ ప్లస్‌ను చేశారు. అందుకు అనుగుణంగా హైస్కూల్ ప్లస్ చదువులపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 2022–23 విద్యా సంవత్సరంలో జిల్లాలో 14 చోట్ల హైస్కూళ్లలోనే ఇంటర్ కళాశాలు(హైస్కూల్ ప్లస్)గా గుర్తించి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించారు. ఇందులో ఎంపీసీ, బైపీసీ, సీఈఓ కోర్సులను అందుబాటులోకి తీసుకురాగా తొలి ఏడాది 119 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వీరిలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఇద్దరు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. మిగతా 117 మంది ఫెయిల్ అయ్యారు. దీంతో సీరియస్‌గా తీసుకున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టి వీటి బలోపేతంపై దృష్టి సారించారు.

**జిల్లాలో ప్లస్ స్కూళ్ల వివరాలు**

జిల్లాలో 14 పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా మార్చారు. చింతకొమ్మదిన్నె జెడ్పీ హైస్కూల్, బద్వేల్ బాలుర హైస్కూల్, చెన్నూరు బాలికల హైస్కూల్, గోపవరం జెడ్పీ హైస్కూల్, కమలాపురం బాలుర హైస్కూల్, తాళ్లప్రొద్దుటూరు జెడ్పీ హైస్కూల్, లింగాల జెడ్పీ హైస్కూల్, ముద్దనూరు జెడ్పీ బాలుర హైస్కూల్, సిద్దవటం మండలం దిగువపేట జెడ్పీ హైస్కూల్, తొండూరు జెడ్పీ హైస్కూల్, మైలవరం మండలం వేపరాల జెడ్పీ హైస్కూల్, ఒంటిమిట్ట జెడ్పీ హైస్కూల్, చిలంకూరు జెడ్పీ హైస్కూళ్లను హైస్కూల్ ప్లస్‌గా మార్చారు.

**సబ్జెక్టు టీచర్ల నియామకం**

హైస్కూల్ ప్లస్‌ను నిర్వహిస్తున్న చోట పూర్తి స్థాయిలో సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండేలా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. 2023–24 విద్యా సంవత్సరానికి ముందుగానే ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ప్రాతిపదికన అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు ఒక ఇంక్రిమెంట్‌తో ఆర్థిక ప్రయోజనం కల్పించి పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన హైస్కూల్ ప్లస్‌లో 92 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించారు. ఇందులో భాగంగా హైస్కూల్ ప్లస్‌లో పీజీటీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 19వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఇందులో జాయినింగ్ ఆఫ్ స్కూల్ అసిస్టెంట్ సీనియారిటీ ప్రకారం అభ్యర్థుల ఎంపికను చేయనున్నారు. ఇందుకు సంబంధించి 20వ తేదీన తుది సీనియారిటీ జాబితా విడుదల చేయనున్నారు. అలాగే 21, 22వ తేదీలలో ఇష్టపూర్వక పత్రం (ఆఫ్ విల్లింగ్) తీసుకుంటారు.

| జిల్లాలో హైస్కూల్ ప్లస్‌కు మంజూరైన పోస్టులు | |
|---|---|
| సబ్జెక్టు | ఖాళీలు |
| తెలుగు | 13 |
| ఇంగ్లిష్ | 13 |
| మ్యాథ్స్ | 10 |
| ఫిజికల్ సైన్సు | 13 |
| కెమిస్ట్రీ | 13 |
| బాటనీ | 9 |
| జువాలజీ | 9 |
| సివిక్స్ | 4 |
| ఎకనామిక్స్ | 4 |
| కామర్స్ | 4 |
| మొత్తం | 92 |

**నాణ్యమైన బోధన అందుతుంది**



ఇంటర్ కోర్సుల ప్రాధాన్యత దృష్ట్యా నాణ్యమైన బోధన అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్లస్ టు స్కూళ్లలో ఆశించిన మేర ఫలితాలు రాకపోవడం వల్ల ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఈ సబ్జెక్టు టీచర్ల నియామకంతో బోధన మెరుగుపడుతుంది. ఉత్తమ ఉత్తీర్ణత శాతం సాధించేందుకు అవకాశం ఉంటుంది.

– ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి, కడప

## మనోవర్తి కేసులో భర్తకు జైలుశిక్ష

బద్వేలు అర్బన్ : భర్త నుంచి వేరుపడి విడిగా ఉంటున్న భార్యకు మనోవర్తి చెల్లింపులో జాప్యం చేసినందుకు బద్వేలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 15 రోజులు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే.. బి.కోడూరు మండలం అక్కుపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి పీరాంబి తన భర్త అయిన చెరుకూరి చిన్నపీరయ్య మీద 2017లో భరణం కేసు దాఖలు చేసింది. సదరు కేసులో ఇరువురిని విచారణ చేసిన న్యాయస్థానం ప్రతి నెల రూ.3 వేలు చొప్పున భరణం చెల్లించాలని 2020 మే 29వ తేదీన ఆదేశాలు ఇచ్చింది. అయితే అప్పటి నుంచి కూడా చిన్నపీరయ్య భరణం చెల్లించకపోవడంతో తిరిగి పీరాంబి కోర్టుకు విన్నవించింది. దీనిపై విచారణ చేపట్టిన బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథ ఆచారి బుధవారం చెరుకూరి చిన్నపీరయ్యకు 15 రోజులు జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. పిటిషనర్ అయిన పీరాంబి తరఫున ఆర్.ఆర్.వర్మ వాదించారు.

## రైల్వే గేట్‌మ్యాన్‌పై దాడి

వాల్మీకిపురం : పట్టణ పరిధి నిమ్మనపల్లి రోడ్డులోని రైల్వేగేట్ వద్ద గేట్‌మ్యాన్‌పై ముగ్గురు యువకులు దాడికి పాల్పడిన సంఘటన చోటు చేసుకొంది. వివరాలు.. రైల్వే స్టేషన్‌లో గేట్‌మ్యాన్‌గా పని చేస్తున్న వాసుదేవరెడ్డి గురువారం స్థానిక నిమ్మనపల్లి రోడ్డులో రైల్వే గేట్‌మ్యాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో రైలు వస్తుండడంతో సిగ్నల్ రావడంతో గేట్ మూసివేశారు. గేట్ తెరవాలని ముగ్గురు యువకులు గేట్‌మ్యాన్‌పై గొడవకు దిగారు. ఇది కాస్తా పెరిగి గేట్‌మ్యాన్‌పై దాడి చేశారు. బాధితుడు వాసుదేవరెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై లీలావతికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.



## పై నుంచి కింద పడి ఐసీఎల్ ఉద్యోగి మృతి



మృతి చెందిన వెంకటరమణ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఐసీఎల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న మెకానికల్ అధికారి నీలం వెంకటరమణ (56) డ్యూటీలో ఉండగా ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడి మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలంకూరు గ్రామానికి చెందిన నీలం వెంకటరమణ కొన్నేళ్ల నుంచి ఐసీఎల్‌లో పని చేస్తున్నాడు. మెకానికల్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుననట్లు ఎస్‌ఐ ఎతలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## అక్కాచెల్లెళ్ల అదృశ్యం

వాల్మీకిపురం : ఇద్దరు అక్కాచెలెళ్లు అదృశ్యమైన సంఘటన మండలంలోని ఓబులంపల్లిలో గురువారం చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఓబులంపల్లికి చెందిన నీరజ (19) వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమె చెల్లులు సంగీత (17) మదనపల్లి బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వీరికి తల్లిదండ్రులు లేకపోవడంతో నానమ్మ లక్ష్మీదేవమ్మ వద్ద ఉంటున్నారు. ఇద్దరికీ వేసవి సెలవులు కావడంతో నానమ్మ ఇంటి దగ్గరే ఉంటున్నారు. గురువారం ఉదయం నుంచి ఇద్దరూ అదృశ్యం అయ్యారని ఏఎస్సై లీలావతికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీపీఐ కార్యాలయంలో ప్రేమ జంటకు వివాహం



నూతన వధూవరులతో సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో గురువారం కడప నగరానికి చెందిన ప్రేమ జంట చందు శ్రీహరి, మెహనూర్‌లకు సీపీఐ నాయకులు వివాహం జరిపించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ కడప నగరానికి చెందిన చందు శ్రీహరి, మెహనూర్ గత ఏడాదిన్నరగా ఒకరినొకరు ఇష్టపడుతున్నారన్నారు. వీరు ఇరువురూ సీపీఐ పార్టీని ఆశ్రయించారన్నారు. వీరు మేజర్లు కావడంతో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. వివాహం అనంతరం వచ్చే ఒడిదుడుకులను తట్టుకుని నిలబడాలని తెలిపామన్నారు. వారు అందుకు సమ్మతించడంతో మీడియా ఎదుట వివాహం జరిపించామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, సభ్యులు హరి, ప్రమీల, ప్రతాప్, సుధాకర్, ఏఐవైఎఫ్ నాయకులు సురేష్, యనస్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం స్పందనలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై తహసీల్దార్ ఉదయ భాస్కర్ రాజును అడిగి తెలుసుకున్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, ఎంపీడీవో అల్తాఫ్ హుస్సేన్ పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ట్రాలీ కింద పడి వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన మక్బుల్

సంబేపల్లె : ట్రాక్టర్ ట్రాలీ కింద పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని రౌతుకుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రౌతుకుంట పంచాయతీ దిన్నెమీదపల్లెకు చెందిన పాలగిరి మక్బుల్ బాషా(34) వ్యవసాయం, రాళ్ల వ్యాపారం చేసుకొంటూ జీవనం సాగిస్తుండే వాడు. ఈ క్రమంలోనే గురువారం గ్రామ సమీపంలో ట్రాక్టర్ ట్రాలీకి మరమ్మతులు చేస్తున్న సమయంలో ఉన్నఫళంగా ట్రాలీ తలపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కు మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపించింది.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం వెలికితీత

మదనపల్లె : మండలంలోని కోటవారిపల్లె పంచాయతీ అడవిలోపల్లె వద్ద ఉన్న నడించెరువులో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందిన కర్ణాటక వాసి శంకర (50) మృతదేహాన్ని గురువారం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెలికి తీశారు. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన శంకర జ్యోతిశ్యం చెబుతూ జీవించేవాడు. ఇతను పట్టణంలోని రామారావుకాలనీలో నివాసమున్న శ్రీనివాసులు హిందూపురం, బోయపేటకు చెందిన నంజుండప్పతో కలిసి అడవిలోపల్లె వద్ద ఉన్న నడించెరువులో మంగళవారం చేపలు పట్టేందుకు వెళ్లాడు. వల వేశారు. తర్వాత ముగ్గురూ కలిసి మద్యం తాగారు. చేపలు పడేంత వరకు ఈత కొట్టాలని చెరువులోకి దిగారు. అయితే చెరువులో ఉపాధి హామీ గుంతలు లోతుగా ఉండటంతో అంచనా వేయలేక శంకర ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. మిగిలిన ఇద్దరు విషయాన్ని స్థానికులకు తెలిపారు. వారు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. రెండు రోజుల పాటూ కష్టపడి మూడో రోజున మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

## ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు



దేవేంద్ర మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : కన్నీటి పర్యంతం నడుమ ఆర్మీ జవాన్ దేవేంద్ర (25) అంత్యక్రియలు గురువారం స్వగ్రామమైన సోమలవాండ్లపల్లిలో జరిగాయి. మండలంలోని మద్దిరేవుల గ్రామం సోమలవాండ్లపల్లెకు చెందిన ఆర్మీ జవాన్ సోమల దేవేంద్ర మృతదేహానికి అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, రామాపురం ఎంపీటీ మద్దిరేవుల సురేంద్రనాథ్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పీలేరు వంటిల్లు వద్ద మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న ఆర్మీ జవాన్ దేవేంద్ర మృతదేహాన్ని బుధవారం స్వగ్రామమైన సోమలవాండ్లపల్లెకు తీసుకురావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దేవేంద్ర మృతదేహం వద్ద తల్లిదండ్రులు, సోదరులు, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. దేవేంద్ర భార్య ఎనిమిది నెలలు గర్భిణి. ఆమె గుండెలవిసేలా రోదించడం పలువురిని కలిచివేసింది. మద్దిరేవుల గ్రామ ఉపసర్పంచ్ సంజీవరెడ్డి, వెంకటరామిరెడ్డి, చిన్న వెంకటరమణ, రమణయ్యలు దేవేంద్ర మృతదేహానికి నివాళులర్పించారు.

## చేయి చేయి కలిపి.. అండగా నిలిచి..



రిటైర్డ్ మహిళా హోంగార్డుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : హోంగార్డులు చేయి చేయి కలిపి తోటి ఉద్యోగికి అండగా నిలిచారు. కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లోని మహిళా హోంగార్డు టి.మధురకుమారి ఇటీవల పదవీ విరమణ పొందారు. జిల్లాలోని హోంగార్డులు అందరూ ఒక రోజు వేతనం రూ.4.16.060 చెక్కును జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చేతుల మీదుగా ఆమెకు అందజేశారు. సాటి హోంగార్డుకు సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన హోంగార్డులను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సోమశేఖర్ నాయక్, హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్ : విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీఎస్పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ ఆదేశించారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన 'డయల్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో ఆయన వినియోగదారుల నుంచి ఫోన్ ద్వారా సమస్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా కడప, ఖాజీపేట, కొండాపురం, పోరుమామిళ్ల, సీకే దిన్నె, చాపాడు, పెద్దముడియం, బద్వేల్ మండలాల నుంచి 11 మంది ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపారు. ఇందులో వ్యవసాయ సర్వీసులకు సంబంధించి ఒకటి, విద్యుత్ లైన్లకు –1, విద్యుత్ స్తంభాలు –1, విద్యుత్ సరఫరాలో అంతరాయం–5, ఇతర సమస్యలు–3 వచ్చాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ ఎస్.చక్రవర్తి, డీఈఈలు పి.సుబ్రమణ్యం, జీవీ సుబ్బారావు, ఏఈ నీరజ, జేఈ లావణ్య పాల్గొన్నారు.

## అనుమతి లేని లేఅవుట్లపై చర్యలు



చాపాడులోని లే అవుట్లను పరిశీలిస్తున్న అనుడా వైస్ చైర్మన్, సిబ్బంది

చాపాడు : నూతనంగా లే అవుట్లు వేసే వారు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని.. అనుమతులు లేకుండా లే అవుట్లు నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని అనుడా వైస్ చైర్మన్ ఓబులేసు నందన్ సూచించారు. మండల కేంద్రమైన చాపాడులోని ప్రొద్దుటూరు–మైదుకూరు రోడ్డులో ఇరువైపులా, నక్కలదిన్నె రోడ్డులో మూడు చోట్ల అనుమతులు లేకుండా వేస్తున్న లే అవుట్లను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లే అవుట్‌ల నిర్మాణం చేపట్టాలంటే ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలన్నారు. లే అవుట్ విస్తీర్ణంలో గ్రామ పంచాయతీకి 10 శాతం భూమిని రిజిస్టర్ చేయించాలన్నారు. అన్నమయ్య డెవలప్‌మెంట్ అథారిటీ అనుమతి తీసుకోవాలన్నారు. అక్రమంగా లే అవుట్‌లు నిర్మించే వారిని గుర్తించి నోటీసులు ఇవ్వాలని సూచించారు. అనుమతులు వచ్చే వరకు పనులు నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అనుడా ఏపీఓ కృష్ణసింగ్, సిబ్బంది సరస్వతి, పంచాయతీ కార్యదర్శులు రవి, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కు తీర్చుకునేందుకు వెళ్తూ..



మృతి చెందిన బలరామయ్య

రాజంపేట : సోమశిల రిజర్వాయర్ ముంపు గ్రామాలైన తిమ్మరాచపల్లె–యల్లంపేట(నందలూరు మండలం) మధ్య వెలసి వున్న ముసలిపేటమ్మకు గురువారం మొక్కులు తీర్చుకునేందుకు వెళ్తున్న భక్తుల బృందం ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటనలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందగా, 11 మంది గాయాల పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు మండలం పల్లంపాడు అరుంధతీవాడకు చెందిన వారు ట్రాక్టర్‌లో ముసలిపేటమ్మ గుడికి బయలుదేరారు. ఈ ట్రాక్టర్‌లో 12 మంది ప్రయాణిస్తున్నారు. సోమశిల బ్యాక్‌వాటర్ గట్టుపై వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో బలరామయ్య (65) అనే వృద్ధుడు దుర్మరణం చెందాడు. మరో 11 మంది గాయాల పాలయ్యారు. గాయపడిన వారిలో రామక్క, లక్షుమయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. నలుగురు రాజంపేట ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. స్వల్ప గాయాలతో ఉన్న వారు ఇంటికి వెళ్లిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. కాగా ట్రాక్టర్ బ్యాక్‌వాటర్‌లో పడకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నందలూరు ఎస్‌ఐ చెన్నకేశవులు తెలిపారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
19-5-2023

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
| 129 | 52 |
| 61,432 | 18,130 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

| విదేశీ సూచీలు (భారత కాలమాన ప్రకారం రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 12,612 | ▲ 111 |
| డోజోన్స్ | 33,276 | ▲ 145 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,742 | ▲ 19 |
| డాక్స్ | 16,163 | ▲ 212 |
| షాంఘై | 3,297 | ▲ 13 |
| నిక్కీ | 30,574 | ▲ 480 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

| బులియన్ (రూపాయల్లో) | ముంబై |
|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 60,474 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 60,232 |
| వెండి (కేజీ) | 71,496 |



## ఇండిగోకు లాభాలు

క్యూ4లో రూ.919 కోట్లు



**న్యూఢిల్లీ:** ఇండిగో బ్రాండ్‌పై విమానయాన సేవలు అందించే ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మార్చి త్రైమాసికంలో లాభాల్లోకి అడుగు పెట్టింది. రూ.919 కోట్ల లాభాన్ని ప్రకటించింది. విదేశీ కరెన్సీ రూపంలో ఆర్జించిన రూ.253 కోట్లను మినహాయించి చూస్తే నికర లాభం రూ.664 కోట్లుగా ఉన్నట్టు అర్థం చేసుకోవచ్చు. అంతక్రితం ఏడాది ఇదే మూడు నెలల కాలంలో ఇండిగో రూ.1682 కోట్ల నష్టాన్ని చూడడం గమనార్హం. మొత్తం ఆదాయం మార్చి త్రైమాసికంలో 78 శాతం పెరిగి రూ.14,600 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.8,207 కోట్లుగా ఉంది. ప్రయాణికుల టికెట్ల రూపంలో ఆదాయం 80 శాతం పెరిగి రూ.12,434 కోట్లుగా ఉంటే, యాన్సిలరీ ఆదాయం (బ్యాగేజీ, ఫుడ్ తదితర) 37 శాతం వృద్ధితో రూ.1,445 కోట్లుగా ఉన్నట్టు ఇండిగో ప్రకటించింది. 2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి విదేశీ మారకం ప్రభావాన్ని మినహాయించి చూస్తే రూ.2,654 కోట్ల లాభం సమకూరింది. కానీ, విదేశీ మారకం ప్రభావాన్ని కలిపి చూస్తే రూ.306 కోట్ల నష్టం సమకూరింది. రూ.44,854 కోట్ల నికర రుణ భారం ఉన్నట్టు కంపెనీ ప్రకటించింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో షేరు రెండు శాతం నష్టపోయి రూ.2,264 వద్ద క్లోజయింది.

## జోయాలుక్కాస్ జ్యువెలరీ ఫెస్టివల్‌కు విశేష స్పందన

**హైదరాబాద్:** ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్– జోయాలుక్కాస్ జ్యువెలరీ ఫెస్టివల్‌కు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. సంస్థ ప్రకటించిన ఈ సంవత్సరపు అతిపెద్ద జ్యువెలరీ ఫెస్టివల్‌లో మే 12 నుంచి గోల్డ్, డైమండ్స్, ప్రెషస్ స్టోన్స్, వెండి జ్యువెలరీపై పలు ఆఫర్లు అమలవుతున్నాయి. జూన్ 11 వరకూ ఈ ప్రత్యేక 'ఆభరణాల పండుగ' నిర్వహణ జరుగుతుంది. మజూరీ చార్జీలపై 50 శాతం వరకూ తగ్గింపు, ప్రతి కొనుగోలుపై కస్టమర్‌కు ఉచిత జీవితకాల నిర్వహణ, సంవత్సరంపాటు ఉచిత బీమా, బైబ్యాక్ హామీ వంటి ఎన్నో ఆఫర్లు ఇందులో భాగంగా ఉన్నాయి.




# ఎస్‌బీఐ లాభం జూమ్

- 83 శాతం వృద్ధితో రూ.16,695 కోట్లు
- షేరుకు రూ.11.30 డివిడెండ్




**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ మార్చి త్రైమాసికానికి మెరుగైన పనితీరు చూపించింది. ఎన్‌పీఏలకు కేటాయింపులు తగ్గడంతో విశ్లేషకుల అంచనాలకు మించి ఫలితాలను ప్రకటించింది. స్టాండలోన్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 83 శాతం వృద్ధితో రూ.16,695 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి లాభం రూ.9,113 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం 29 శాతం పెరిగి రూ.40,393 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి నికర వడ్డీ ఆదాయం రూ.31,198 కోట్లుగా ఉండడం గమనార్హం. ఒక్కో షేరుకు రూ.11.30 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని ఎస్‌బీఐ నిర్ణయించింది. మొండి రుణాలకు (ఎన్‌పీఏలు) కేటాయింపులు, కంటింజెన్సీలు 54 శాతం తగ్గి రూ.3,316 కోట్లకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో కేటాయింపులు రూ.7,237 కోట్లుగా ఉన్నాయి. ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏలు 2.78 శాతానికి తగ్గాయి. ఇవి క్రితం ఏడాది ఇదే త్రైమాసికం నాటికి 3.97 శాతంగా ఉంటే, 2022 డిసెంబర్ చివరికి 3.14 శాతంగా ఉన్నాయి. నికర ఎన్‌పీఏలు 0.67 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం ఏడాది మార్చి చివరికి ఇవి 1.08 శాతం, 2022 డిసెంబర్ చివరికి 0.77 శాతంగా ఉండడం గమనార్హం. దేశీయ వ్యాపారంపై నికర వడ్డీ మార్జిన్ 3.84 శాతానికి పుంజుకుంది.

- మార్చి త్రైమాసికానికి కన్సాలిడేటెడ్ నికర లాభం (అనుబంధ సంస్థలతో కలిపి) క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.9,994 కోట్ల నుంచి రూ.18,343 కోట్లకు వృద్ధి చెందింది. 90 శాతానికి పైగా పెరిగింది. కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.1,08,034 కోట్ల నుంచి, రూ.1,36,852 కోట్లకు పెరిగింది.
- మార్చి త్రైమాసికానికి నిర్వహణ లాభం 25 శాతం వృద్ధితో రూ.24,621 కోట్లకు చేరుకుంది.
- ప్రొవిజన్ కవరేజ్ రేషియో 1.35 శాతం మెరుగుపడి 76.39 శాతంగా ఉంది.
- రుణాల్లో 16 శాతం వృద్ధి నమోదైంది. మార్చి చివరికి రూ.32.69 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్ రుణాలు వార్షికంగా 12 శాతం పెరిగాయి. రిటైల్ రుణాలు 18 శాతం పెరిగాయి.
- డిపాజిట్లు 9 శాతం వృద్ధితో రూ.44.23 లక్షల కోట్లకు చేరాయి.
- 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఎస్‌బీఐ స్టాండలోన్ నికర లాభం రూ.50,232 కోట్లకు చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2021–22)తో పోలిస్తే 58 శాతం పెరిగింది. స్టాండలోన్ ఆదాయం రూ.1,06,912 కోట్లుగా నమోదైంది.
- 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కన్సాలిడేటెడ్ లాభం రూ.35,374 కోట్ల నుంచి రూ.56,558 కోట్లకు చేరింది. ఆదాయం రూ.4,06,973 కోట్ల నుంచి రూ.4,73,378 కోట్లకు చేరింది.
- బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు 2 శాతానికి పైగా నష్టపోయి రూ.574 వద్ద క్లోజ్ అయింది. ఇంట్రాడేలో రూ.571.40 కనిష్ట స్థాయిని చూసింది.

# ఐటీసీ లాభం భళా

- మార్చి క్వార్టర్‌లో రూ.5,225 కోట్లు
- ఎఫ్ఎంసీజీలో బలమైన వృద్ధి
- ఒక్కో షేరుకు రూ.9.5 డివిడెండ్




**న్యూఢిల్లీ:** ఎఫ్ఎంసీజీ, హోటళ్లు, పేపర్ తదితర వ్యాపారాల్లోని ఐటీసీ లిమిటెడ్ మార్చి త్రైమాసికంలో మెరుగైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో పోల్చి చూసినప్పుడు 23 శాతం వృద్ధితో రూ.5,225 కోట్లుగా నమోదైంది. ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 7 శాతం వృద్ధితో రూ.18,799 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.4,260 కోట్లు, ఆదాయం రూ.17,754 కోట్లు చొప్పున ఉంది. కంపెనీ వ్యయాలను సమర్థవంతంగా అదుపు చేసింది. కేవలం 2 శాతమే పెరిగి రూ.12,901 కోట్లుగా ఉన్నాయి. అన్ని విభాగాల్లోనూ బలమైన వృద్ధిని కొనసాగించినట్టు ఐటీసీ లిమిటెడ్ తెలిపింది. 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఐటీసీ కన్సాలిడేటెడ్‌గా రూ.19,428 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం (2021–22)లో లాభం రూ.15,486 కోట్లతో పోలిస్తే 25 శాతం వృద్ధి చెందింది. ఆదాయం క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 17 శాతానికి పైగా పెరిగి రూ.75,826 కోట్లకు చేరుకుంది. ఐటీసీ నిర్వహణ ఆదాయం రూ.75,000 కోట్లు దాటడం ఇదే మొదటిసారి.

**విభాగాల వారీగా..**

మార్చి త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ విభాగం (సిగరెట్లు సహా) ఆదాయం 15 శాతం పెరిగి రూ.13,033 కోట్లుగా ఉంది. ఇందులో సిగరెట్ల ఆదాయం వరకే చూస్తే 13 శాతం వృద్ధితో రూ.8,082 కోట్లుగా ఉంది. చట్టవిరుద్ధమైన మార్గాల్లో సిగరెట్ల సరఫరాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ తీసుకున్న చర్యలు ఫలితమిచ్చినట్టు ఐటీసీ తెలిపింది. సిగరెట్లు కాకుండా ఇతర ఎఫ్ఎంసీజీ ఆదాయం వరకే చూస్తే 19 శాతానికి పైగా పెరిగి రూ.4,951 కోట్లుగా ఉంది. పేపర్‌బోర్డ్స్, ప్యాకేజింగ్ ఆదాయం 2% పెరిగి రూ.2,221 కోట్లుగా ఉంది. షేరుకి తుది డివిడెండ్ కింద రూ.6.75, ప్రత్యేక డివిడెండ్ కింద రూ.2.75 (మొత్తం రూ.9.5) చొప్పున ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది.

# చివరికి నష్టాల్లో..

మార్కెట్లు వరుసగా మూడో రోజు డౌన్



**ముంబై:** దిగ్గజ సంస్థలు ఐటీసీ, ఎస్‌బీఐ ఆర్థిక ఫలితాలు ఇన్వెస్టర్లను మెప్పించలేకపోవడం తదితర అంశాల కారణంగా దేశీ మార్కెట్లు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. గురువారం దాదాపు రోజంతా లాభాల్లోనే ట్రేడయినప్పటికీ ఆఖర్లో సెన్సెక్స్ 129 పాయింట్లు కోల్పోయి 61,432 వద్ద, నిఫ్టీ 52 పాయింట్ల నష్టంతో 18,130 వద్ద క్లోజయ్యాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 61,956–61,349 పాయింట్ల గరిష్ట, కనిష్ట స్థాయిలో తిరుగాడింది. అంతర్జాతీయంగా సానుకూల ధోరణులు నెలకొన్నప్పటికీ, ఆరంభ లాభాలను కోల్పోయి నిఫ్టీ వరుసగా మూడో రోజు నష్టాల్లో ముగిసినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ విభాగం హెడ్ దీపక్ జసానీ తెలిపారు. వారాంతపు ఎక్స్‌పైరీ రోజున మార్కెట్లు ఒడిదుడుకుల్లో ట్రేడయినట్లు, నిర్దిష్ట స్టాక్స్‌లో లాభాల స్వీకరణతో సూచీలు నష్టాల్లో ముగిసినట్లు రెలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. సెన్సెక్స్ స్టాక్స్‌లో టైటాన్, పవర్ గ్రిడ్, ఎల్‌అండ్‌టీ, టాటా మోటార్స్ మొదలైనవి నష్టపోయాయి. ఐటీసీ 2%, ఎస్‌బీఐ 1.77% క్షీణించాయి. బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ మొదలైనవి లాభపడ్డాయి. మిడ్‌క్యాప్ సూచీ 0.67%, స్మాల్‌క్యాప్ 0.26% క్షీణించాయి. ఇతర సూచీల్లో రియల్టీ 2.29%, సర్వీసెస్ 1.60%, పవర్ 1.43% తగ్గాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకెక్స్ లాభపడ్డాయి. ఆసియా మార్కెట్లు చూస్తే.. దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

**25 పైసలు తగ్గిన రూపాయి..**

విదేశీ మార్కెట్లలో డాలరు బలపడటం, దేశీ ఈక్విటీల్లో బలహీన ట్రెండ్‌తో దేశీ కరెన్సీ రూపాయి మారకం విలువ గురువారం 25 పైసలు క్షీణించింది. డాలరుతో పోలిస్తే 82.62 వద్ద క్లోజయ్యింది.

## టైమెక్స్ చేతికి జస్ట్ వాచెస్

**న్యూఢిల్లీ:** గడియారాల తయారీలో ఉన్న యూఎస్ కంపెనీ టైమెక్స్ గ్రూప్ తాజాగా ప్రీమియం వాచ్ రిటైల్ బ్రాండ్ జస్ట్ వాచెస్‌ను కొనుగోలు చేసింది. డీల్ విలువను కంపెనీ వెల్లడించలేదు. ఈ డీల్ ద్వారా టైమెక్స్ ఇండియా చేతికి జస్ట్ వాచెస్ స్టోర్లు, ఈ–కామర్స్ పోర్టల్ అయిన జస్ట్‌వాచెస్.కామ్ వచ్చి చేరాయి. 'మా భవిష్యత్ వృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా ఈ కొనుగోలు ఉంటుంది. రెండు బ్రాండ్‌ల కలయిక మధ్య ఒక కచ్చితమైన సహకారం తెస్తుంది. వినియోగదారులకు విస్తృత స్థాయిలో వాచెస్‌ను ఎంపిక చేసుకునేందుకు వీలు కల్పిస్తుందని విశ్వసిస్తున్నాము' అని టైమెక్స్ గ్రూప్ తెలిపింది. జస్ట్ వాచెస్‌ను దక్కించుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా కస్టమర్ల సంఖ్యను పెంచుకోవడానికి సన్నద్ధం అయ్యామని టైమెక్స్ ఇండియా ఎండీ దీపక్ ఛబ్రా అన్నారు. టైమెక్స్ వరల్డ్ పేరుతో టైమెక్స్ ఇండియా దేశవ్యాప్తంగా 35 ఎక్స్‌క్లూజివ్ ఫ్రాంచైజీ స్టోర్లను నిర్వహిస్తోంది.



# భారత్‌లో రూ. 1.05 లక్షల కోట్ల పెట్టుబడులు

2030 నాటికి క్లౌడ్ ఇన్‌ఫ్రాపై
అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రణాళికలు




**న్యూఢిల్లీ:** భారత్‌లో క్లౌడ్ సేవలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) భారీ పెట్టుబడుల ప్రణాళికలను ప్రకటించింది. 2030 నాటికి క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై 12.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,05,600 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. 2016–2022 మధ్య కాలంలో చేసిన 3.7 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 30,900 కోట్లు) కూడా కలిపితే దీర్ఘకాలంలో 2030 నాటికి తమ పెట్టుబడులు 16.4 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 1,36,500 కోట్లు) చేరినట్లవుతుందని ఏడబ్ల్యూఎస్ పేర్కొంది. డేటా సెంటర్ మౌలిక సదుపాయాలపై కొత్త ప్రతిపాదిత పెట్టుబడులతో భారతీయ వ్యాపార సంస్థల్లో ఏటా సగటున 1,31,700 పూర్తి స్థాయి కొలువులకు సరిసమానమైన ఉద్యోగాల కల్పన జరగగలదని వివరించింది. నిర్మాణం, ఫెసిలిటీ మెయింటెనెన్స్, ఇంజినీరింగ్, టెలికమ్యూనికేషన్స్ మొదలైన విభాగాల్లో ఇవి ఉండగలవని ఏడబ్ల్యూఎస్ పేర్కొంది.

**రెండు డేటా సెంటర్లు..**

ఏడబ్ల్యూఎస్‌కు భారత్‌లో రెండు డేటా సెంటర్ ఇన్‌ఫ్రా రీజియన్లు ఉన్నాయి. ఏడబ్ల్యూఎస్ ఏషియా పసిఫిక్ రీజియన్‌లను 2016లో ముంబైలో ఒకటి, 2022లో హైదరాబాద్‌లో మరొకటి ప్రారంభించింది. వ్యయాలు తగ్గించుకునేందుకు, నవకల్పనలను వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు, మార్కెట్‌ను సత్వరం అందిపుచ్చుకునేందుకు దేశీయంగా వేలకొద్దీ క్లయింట్లు తమ సేవలను ఉపయోగిస్తున్నట్లు ఏడబ్ల్యూఎస్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ చెప్పారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మొదలుకుని అశోక్ లేల్యాండ్, యాక్సిస్ బ్యాంక్ వంటి దిగ్గజాలు, ఇతరత్రా స్టార్టప్‌లు మొదలైనవెన్నో వీటిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

# యువర్స్

• గేమింగ్

## అదిగో...ఆ బంకర్‌లోనే!



**ఈ** నెలలో విడుదల అనుకున్న ఫస్ట్ పర్సన్ హారర్ గేమ్ 'అమ్నేసియా: ది బంకర్' జూన్ 6న విడుదల కానుంది. అమ్నేసియా సిరీస్‌లో భాగంగా వస్తున్న నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ ఇది. మొదటి ప్రపంచ యుద్ధం నేపథ్యంలో సాగే ఈ గేమ్‌లో ప్లేయర్స్ ఫ్రెంచ్ సైనికుడు హెన్రీ క్లైమెంట్ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయాలి. సేఫ్ ప్లేస్ ఏమిటో తెలుసుకోవాలి. ఒక బంకర్ మిస్టరీని ఛేదించాలి.

**జానర్స్:** అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్
**ఇంజిన్:** హెచ్‌పీఎల్ ఇంజిన్, హెచ్‌పీఎల్ ఇంజిన్ 3.5 **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 4, ఎక్స్ బాక్స్ వన్, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్ అండ్ సిరీస్ ఎస్

## అవును... ఇది నిజమే!



**క్వీన్** విక్టోరియన్ శకం (బ్రిటన్)లో పువ్వుల భాష 'ఫ్లోరియోగ్రఫీ'గా ప్రసిద్ధి పొందింది. వ్యక్తులు తమ భావాలు, సెంటిమెంట్లను ఇతరులతో పంచుకోవడానికి రకరకాల పువ్వులను ఉపయోగించేవారు. ప్రతి పువ్వుకు సింబాలిక్ మీనింగ్ ఉండేది. ఉదా: రెడ్ రోజ్–స్వచ్ఛమైన ప్రేమ, ఎల్లో రోజ్–స్నేహం, పింక్ రోజ్–ఆరాధన, సన్‌ఫ్లవర్–నమ్మకం, విశ్వాసం. కలర్స్, అరేంజ్‌మెంట్స్ అనేవి 'రహస్య సందేశం'లో కీలకపాత్ర పోషించేవి. ఒక్కో పువ్వుకు మాత్రమే కాకుండా పువ్వుల సముదాయానికి కూడా ప్రత్యేక అర్థాలు ఉండేవి. ఆ కాలంలో ప్రేమవ్యక్తీకరణకు అంతగా స్వేచ్ఛ లేకపోవడంతో ఈ పువ్వుల భాషను ఉపయోగించేవారు.

# అడవి రాసిన కవిత్వం

**అమ్మ... తియ్యనైన పదం. అమ్మ భాష... మృదుమధురం. అడవిలో పుట్టిన సంస్కృతి... అడవి పురుడు పోసిన సాహిత్యం. నాగరకత దాడికి లోనవుతుంటే... అడవి బిడ్డ గుండె కన్నీరవుతోంది. అమ్మ భాష కోసం కలం పట్టాడు... అందమైన గ్రంథరూపమిస్తున్నాడు. కొలామ్ భాష కోసం ఆత్రం మోతీరామ్ చేస్తున్న సాహిత్య సేవ ఇది.**

• మోతీరామ్ సాహితీయజ్ఞం



ఆత్రం మోతీరామ్

తెలంగాణ రాష్ట్రం, కుమ్రుం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా(ఉమ్మడి ఆదిలాబాద్) వాంకిడి మండలంలోని నగర్‌గుట్టలో పుట్టాడు ఆత్రం మోతీరామ్. కొలామ్ తెగకు చెందిన మోతీరామ్ తమ భాషలో పుట్టిన అచ్చమైన స్వచ్ఛమైన పదాలు అంతరించిపోతున్నాయని తెలుసుకుని ఆవేదన చెందాడు. గ్రంథస్థం చేయడమే పరిష్కారం అని భావించి మౌఖికంగా ఉన్న అడవి పదాలు, పాటలను అక్షరబద్ధం చేస్తున్నాడు. తన అనుభవాలు, అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నాడీ యువకుడు.

**అడవి నేర్పిన అక్షరాలు**

''మా ఊరి పాఠశాలలో రెండోతరగతి చదివాను. ఆ తరవాత చౌపన్‌గూడ శాటిలైట్ సెంటర్ ఆశ్రమ పాఠశాలలో చేర్చేటప్పుడు మళ్లీ ఒకటో తరగతిలో చేర్చాడు మా నాన్న. నాలుగవ తరగతి తర్వాత ఆసిఫాబాద్ పీటీజీ గురుకుల పాఠశాలలో పదవ తరగతి వరకు చదివాను. ఉట్నూరు గవర్నమెంట్ కాలేజ్‌లో బీఎస్సీ, ఐటీడీఏ శిక్షణ కళాశాలలో బీఈడీ చేశాను. ఇప్పుడు కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య విధానంలో ఎం.ఏ తెలుగు చేస్తున్నాను.



మోతీరామ్ రచనలు

**బొమ్మల సాహిత్యం**

నా సాహిత్య ప్రస్థానం గురించి చెప్పాలంటే... అది చిత్రలేఖనంతో మొదలైంది. మా నాన్న వ్యవసాయంతోపాటు వడ్రంగం కూడా చేసేవాడు. తలుపుల మీద నెమలి, పూలు, చెట్లు, పండ్లు... ఇలా రకరకాలు చిత్రించేవాడు. వాటిని పరిశీలనగా చూసి నేనూ బొమ్మలు వేసేవాడిని. గురుకుల పాఠశాలలో చిత్రలేఖనం పోటీల్లో కూడా పాల్గొన్నాను. ఎనిమిదవ తరగతికి వచ్చినప్పటి నుంచి నేను వేసిన బొమ్మలకు చిన్న వ్యాఖ్యానం రాయడం మొదలు పెట్టాను. నాకు పెద్ద పెద్ద విషయాలు తెలిసి కాదు, నా మనసుకు అనిపించిన విషయాన్ని అచ్చంగా అలాగే రాసేవాడిని. మా సత్యనారాయణ సార్ నేను రాసిన వ్యాఖ్యానంలో అక్షరదోషాలు, వ్యాకరణ దోషాలను దిద్దేవారు. నేను వ్యక్తం చేసిన భావాలనే వాక్యాలుగా రాస్తే అదే కవిత్వం అవుతుందని, కవిత్వం రాయడంలో మెళకువలు నేర్పించారు.

**తొలి పుస్తకం కుమ్రుం సూరు**

కవిత్వం రాయడంలో ఒడుపు తెలిసిన తర్వాత ఇక నేను వెనుదిరిగి చూడలేదు. నా తొలి పుస్తకం కుమ్రుం సూరు జీవిత చరిత్ర. ఆత్రం భీమ్‌రావు అనే మా కొలామ్ నాయకుడు సూరు జీవితాన్ని మౌఖికంగా చెప్పడంతో నేను అక్షరబద్ధం చేశాను. ఆ తర్వాత దండారి కైతికాలు అని దండారి నృత్యం గురించి రాశాను. మా కొలామ్‌ల ఆరాధ్యదైవం దంతన్‌పల్లి భీమయ్యక్ మహత్యం రాసిన తర్వాత మా నాన్న కోసం మోతీరామ్ శతకం రాశాను. మానవుడు ఎలాంటి వాడు అనేది కథాంశం. ఇవన్నీ తెలుగు లిపిలోనే రాశాను. ఎందుకంటే మా కొలామ్ భాషకు లిపి లేదు. కవిత్వం కూడా కొలామ్ భాషలోనే తెలుగు లిపితో రాశాను. కొన్ని కవితలు తెలుగులోనూ రాశాను.

**అముద్రితం**

ఉట్నూరుకు వచ్చిన తర్వాత నా అక్షరాల ఆకలి తీరిందని చెప్పాలి. అక్కడ 'ఉట్నూరు సాహితీ వేదిక'లో ప్రతి నెలా తొలి ఆదివారం కవి సమ్మేళనం జరిగేది. ప్రతి కవి సమ్మేళనంలోనూ నా కవిత ఉండాలని నిర్వాహకులు నన్ను బాగా ప్రోత్సహించారు. అలాగే రాశాను. నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమం పతాకస్థాయిలో ఉంది. ఉద్యమం కోసం ఒక పుస్తకం రాశాను. అది ప్రచురణకు నోచుకునే లోపు తెలంగాణ రావడంతో అది చేతిరాత ప్రతిగానే ఉండిపోయింది.

**ఆకాశవాణిలో కొలామీ కవిత్వం**

కొలామీ భాషలో రాసిన కవిత్వం ఆకాశవాణిలో ప్రసారమైంది. అలాగే 2021లో విజయవాడలో జరిగిన గిరిజన సాహిత్య సదస్సులో పాల్గొని మా భాషలో కవిత చదివాను. ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ రవీంద్రభారతిలో 'దక్షిణ భారత కవుల కలయిక'లోనూ అవకాశం వచ్చింది. కొలామీలో కవిత, దానికి తెలుగు అనువాదం కూడా చేశాను. ఒడిశా రాష్ట్రం, భువనేశ్వర్‌లో జరిగిన 'అఖిల భారత గోండ్వానా సాహిత్య సభలు'కు ఆహ్వానం వచ్చింది. కానీ పరీక్షల కారణంగా వెళ్లలేకపోయాను. ఈ సాహిత్య ప్రస్థానంలో నా ఆకాంక్ష ఒక్కటే... మా కొలామీ భాషను అంతరించి పోనివ్వకుండా కాపాడుకోవడం. ఇప్పటికే చాలా నష్టం జరిగింది. ఈ తరం చిన్న పిల్లలు చాలా పదాలను మర్చిపోయారు. తల, దేహం, ఉడుత, చిలుక వంటి పదాలను తెలుగులో చెప్తున్నారు తప్ప కొలామీలో చెప్పడం మర్చిపోయారు. అందుకే అలాంటివి కనుమరుగు కాకుండా అక్షరాల్లో, ఆడియోల్లోనూ రికార్డ్ చేయాలనేదే నా ఆకాంక్ష.

**మౌఖిక సాహిత్యం అక్షరాల్లోకి...**

మా కొలామీ భాష మధ్య ద్రావిడ భాష. దీనికి లిపి లేదు. కానీ విస్తృతమైన సాహిత్యం ఉంది. బాల సాహిత్యం, పొడుపు కథలు, భీమయ్యక్ పాటలు, దేవుడి పాటలు, పెళ్లి, ఇతర వేడుకల పాటలన్నీ మౌఖికంగా ఒక తరం నుంచి మరొక తరానికి ప్రసారం అవుతున్నాయి. ఇప్పుడు వస్తున్న మార్పులతో ఈ తరం పిల్లలు మా పాటలను మర్చిపోతే ఇక ఈ తరంలోనే మా సాహిత్యం కూడా అంతర్ధానమైపోతుంది. అందుకే ఈ పని మొదలుపెట్టాను. ప్రతి పదాన్ని పొల్లుపోకుండా గ్రంథస్థం చేస్తాను.
– ఆత్రం మోతీరామ్

– వాకా మంజులారెడ్డి,
ఫొటోలు : ఆత్రం జగదీశ్,
సాక్షి, ఇంద్రవెల్లి

• టెక్... టాక్

## రియల్ మీ నార్జో ఎన్53



**డిస్‌ప్లే:** 6.72 అంగుళాలు **ఫ్రంట్ కెమెరా:** 8–మెగా పిక్సెల్ **ర్యామ్:** 4జీబి 6జీబి **స్టోరేజ్:** 64 జీబి 128జీబి **బ్యాటరీ:** 5000 ఎంఏహెచ్ **వోఎస్:** ఆండ్రాయిడ్ 13 **రిజల్యూషన్:** 2400×1080 పిక్సెల్స్ **రిఫ్రెష్ రేట్:** 90 హెచ్‌జడ్ **కలర్స్:** బ్లాక్ అండ్ గోల్డ్

## గూగుల్ 'ఎబౌట్ దిజ్ ఇమేజ్' టూల్



**గూ**గుల్ 'ఎబౌట్ దిజ్ ఇమేజ్' అనే టూల్‌ని తీసుకురానుంది. దీని ద్వారా ఒక ఇమేజ్ లేదా సిమిలర్ ఇమేజ్ గూగుల్‌లో మొదటిసారిగా ఎప్పుడు కనిపించిందో తెలుసుకోవచ్చు. ఇమేజ్ తాలూకు కంటెంట్, కాంటెక్స్ట్‌లను బాగా అర్థం చేసుకోవచ్చు. బ్యాక్‌గ్రౌండ్ ఇన్‌ఫర్మేషన్ మరింతగా తెలుసుకోవచ్చు. ఒక ఇమేజ్‌కు సంబంధించిన విశ్వసనీయత (సహజమైన ఇమేజా? ఏఐ ఇమేజా?)పై స్పష్టత వస్తుంది.

## ఫెయిర్‌బడ్స్ ఎక్స్‌ఎల్ హెడ్‌ఫోన్స్



ఫెయిర్‌ఫోన్ 'ఫెయిర్‌బడ్స్ ఎక్స్‌ఎల్' పేరుతో హెడ్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. ఇది మాడ్యూలర్ మరియు రిపేర్ ఫ్రెండ్లీ హెడ్‌ఫోన్. ఇయర్ కుషన్‌ను సులభంగా రీప్లేస్ చేసుకోవచ్చు. **బ్యాటరీ:** 800 ఎంఏహెచ్ (ఈజీ–టు–రీప్లేస్ బ్యాటరీ) • వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ • 40ఎంఎం డ్రైవర్స్ • **బ్లూటూత్:** 5.1

## గెలాక్సీ వాచ్ 5 ప్రో



**ట్రె**క్కింగ్, మౌంటెన్ క్లైంబింగ్‌లాంటి ఔట్‌డోర్ యాక్టివిటీలకు సౌకర్యంగా ఉండేలా శాంసంగ్ గెలాక్సీ వాచ్‌ను డిజైన్ చేశారు.
**డిస్‌ప్లే:** 1.4 అంగుళాలు **కలర్స్:** బ్లాక్ అండ్ గ్రే
• కోర్నింగ్ గొరిల్లా గ్లాస్ • బ్లూటూత్ కాలింగ్
**ఫీచర్:** చెకింగ్ నోటిఫికేషన్స్, సెట్టింగ్ టైమర్స్...మొదలైనవి. • డ్యూయల్–కోర్ ప్రాసెసర్
• 1.5జీబి ర్యామ్ ప్లస్ 16జీబి ఇంటర్నల్ స్టోరేజ్ **ధర:**
• ₹44,999 (రెగ్యులర్ బ్లూటూత్ మోడల్) • ₹49,999 (ఎల్‌టీఈ వేరియంట్)

## కెనాన్ పవర్ షాట్



కెనాన్ 'పవర్ షాట్ వీ10' పేరుతో కొత్త వ్లోగింగ్ కెమెరాను లాంచ్ చేసింది. తేలికగా ఉండే ఈ కెమెరాను సులభంగా పాకెట్‌లో పెట్టుకోవచ్చు. క్రౌడ్ ప్లేసెస్‌లో కంఫర్టబుల్‌గా రికార్డ్ చేయడానికి వ్లాగర్స్‌కు ఉపయోగపడుతుంది. సింగిల్ హ్యాండ్‌తో దీన్ని ఆపరేట్ చేయవచ్చు. • 2.0 అంగుళాల ఎల్‌సీడీ టచ్‌స్క్రీన్
• హెచ్‌డీఎంఐ, యుఎస్బీ పోర్ట్ • **ధర:** ₹39,995

ఆర్ట్ అండ్ కల్చర్

## ముందైతే నీళ్లు తాగు నాయనా!



**టర్కీ** కార్టూనిస్ట్ మూస గుమ్‌స్ గీసిన ఈ కార్టూన్ చూసి చిన్న కథ చెప్పమంటే ఇలా చెప్పవచ్చు... దారిన పోయే దానయ్య దారి తప్పాడు. ఎటెటో వెళుతున్నాడు. ఎండకు విపరీతమైన దాహం వేస్తోంది. నిర్జన ప్రాంతంలో చుక్క నీరు కనిపించడం లేదు. దాహంతో కళ్లకు చీకట్లు కమ్ముతున్నాయి. అప్పుడే ఏదో మెరుపు మెరిసింది. చూస్తే....అల్లావుద్దీన్ అద్భుత దీపం!

దాన్ని టచ్ చేయగానే 'ఏం కావాలో కోరుకో నాయనా. ఒకటే ఛాన్సు అని గుర్తుంచుకో' అన్నది జీన్నీ భూతం.'లెక్క లేనన్ని వజ్రవైఢూర్యాలు కావాలి. వాటిని తీసుకెళ్లడానికి గుర్రపుబండ్లు కావాలి' అని అడిగాడు. అతడు కోరుకున్నవి వచ్చాయి. వజ్రవైఢూర్యాలను తీసుకువెళుతున్నప్పుడు దానయ్యలో దాహం పెరిగిపోయింది. 'ఈ దాహంతో చనిపోయేలా ఉన్నాను. చచ్చిన తరువాత ఈ వజ్రవైఢూర్యాలను ఏం చేసుకుంటాను. జీన్నీని గుక్కెడు నీళ్లు అడిగే ఉంటే బతికి ఉండేవాడిని కదా' అనుకుంటున్న సమయంలో జీన్నీ ప్రత్యక్షమై 'ముందైతే నీళ్లు తాగు నాయనా!' అని దయతలిచింది. 'విచక్షణ' అనేదాని గురించి వివరించి చెప్పింది. ఇక మూస గుమ్‌స్ విషయానికి వస్తే... బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మేనేజ్‌మెంట్ చదువుకున్న మూస ఎన్నో పత్రికలలో పనిచేశాడు. పిల్లల పుస్తకాలకు బొమ్మలు వేశాడు. 'ఫన్నీ న్యూస్' అనే రేడియో ప్రోగ్రాం కోసం కలం పట్టాడు.